వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 079
పేజీలు : 06 | వెల: రూ.5/-
మంగళవారం
మార్చి 10, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net

## కేసీఆర్, కేటీఆర్‌లను కలిసిన నాగుర్ల

ఘనంగా వెంకటేశ్వర్లు జన్మదిన వేడుకలు




3లో..

వివరాలు2లో..

# దివ్య క్షేత్రం గట్ల మీది తీర్థం




- ఆధ్యాత్మిక వైభవం చంద్రగిరి క్షేత్రం
- గజేంద్ర మోక్షం జరిగిన పుణ్యస్థలిగా చారిత్రక నేపథ్యం
- వసతుల లేమితో భక్తులకు తప్పని కష్టాలు
- రూ. 5 కోట్లతో అభివృద్ధికి బాటలు వేయాలి
- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలె



## ఆదరణ కరువైన ఆధ్యాత్మిక నిలయం

హనుమకొండ జిల్లా దామెర మండలం కోగిలవాయి గ్రామ పరిధిలోని చంద్రగిరి గుట్టలపై వెలసిన శ్రీ చెన్నకేశవ స్వామి క్షేత్రం ఆధ్యాత్మికతకు, ప్రకృతి సౌందర్యానికి నెలవు. తిరుమల, యాదాద్రి తరహాలో కొండపై కొలువుదీరిన ఈ స్వామిని భక్తులు తమ ఇలవేల్పుగా, కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా కొలుస్తారు. ఏటా ఫాల్గుణ మాసంలో ఇక్కడ జరిగే బ్రహ్మోత్సవాలకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచే కాక ఇతర ప్రాంతాల నుండి వేలాదిగా భక్తులు తరలివస్తారు. గజేంద్ర మోక్షం జరిగిన పుణ్యస్థలిగా, రెడ్డి రాజుల పరిపాలనా కేంద్రంగా చారిత్రక విశిష్టత ఉన్న ఈ క్షేత్రం ప్రస్తుతం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. సరైన మెట్ల దారి, రోడ్డు వసతి లేక భక్తులు మట్టి దారిలోనే ప్రయాణిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పురాతన క్షేత్రాన్ని రూ. 5 కోట్ల నిధులతో అభివృద్ధి చేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని భక్తులు, ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. పాలకుల చొరవతో ఈ రమణీయ దృశ్యం పూర్వ వైభవాన్ని సంతరించుకోవాలని అందరూ ఆశిస్తున్నారు. - వరంగల్ వాయిస్, ప్రత్యేక కథనం



5లో..

## ఇంటర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

☐ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ దివాకర్ టీఎస్

## జనాభా గణన- 2027కు సర్వం సిద్ధం

☐ అధికారులకు మూడు రోజుల శిక్షణ ప్రారంభం



6లో..



6లో..

## రేణుక ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే నాయిని

ఆలయ అభివృద్ధికి రూ.10 లక్షలు మంజూరు







గడ్డం కేశవమూర్తి

# దివ్య క్షేత్రం.. గట్ల మీది తీర్థం..



- ఆదరణ కరువైన ఆధ్యాత్మిక నిలయం
- ప్రకృతి ఒడిలో చంద్రగిరి క్షేత్రం
- గజేంద్ర మోక్షం జరిగిన పుణ్యస్థలిగా చారిత్రక నేపథ్యం
- వసతుల లేమితో భక్తులకు తప్పని కష్టాలు
- రూ. 5 కోట్లతో అభివృద్ధికి బాటలు వేయాలి
- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలె
- కొనసాగుతున్న చంద్రగిరి శ్రీ చెన్నకేశవ స్వామి జాతర

**అది ఒక రమణీయ దృశ్యం. ఆబాల గోపాలానికి ఆధ్యాత్మిక ఔన్నత్యానికి ప్రతీక. విశ్వాస పరులందరికీ నిత్య దర్శనీయ స్థలం. ఎటు చూసినా పచ్చని చెట్లు.. చుట్టూ ఎత్తైన గుట్టలు... కొండలపై పెద్దకొలను.. దానిని ఆనుకొని ప్రధాన దేవాలయం.. అక్కడక్కడ చిన్న చిన్న గుళ్ళు ,గోపురాలు ,నీటి గుండాలు.. అది ఒక సుందర ప్రదేశం. పుణ్యమూర్తులకు సుమధుర సుందర పుణ్యక్షేత్రమే చంద్రగిరి శ్రీ చెన్నకేశవ స్వామి కొలువుదీరిన దివ్య క్షేత్రం. ''గట్ల''మీది తీర్థంగా ప్రఖ్యాతిగాంచిన ఈ క్షేత్రాన్ని చంద్రగిరి శ్రీ చెన్నకేశవ స్వామిగా భక్తులు కొలుస్తారు. హనుమకొండ జిల్లా కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరాన ఉన్న ఈ క్షేత్రం.. తిరుమల, యాదాద్రి (యాదగిరి) గుట్టల రీతిలో కొండపై వెలసింది. ప్రతి ఏటా ఫాల్గుణ మాసంలో వేలాది మంది భక్తులతో కిటకిటలాడే ఈ ఆలయానికి చారిత్రకంగా నేపథ్యం ఉన్నది. భక్తజన బాంధవుడిగా, కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా ప్రణతులు అందుకునే శ్రీ చెన్నకేశవ స్వామి పిలిస్తే పలికే దేవుడిగా ఖ్యాతి గడించారు.**

2026 మార్చి 1 ఆదివారం శ్రీ విశ్వా వసునామ సంవత్సరం ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి రోజున కోగిలవాయి గ్రామ దేవాలయం నుంచి శ్రీ చెన్నకేశవ స్వామి చంద్రగిరి గుట్ట పైకి చేరుకున్నారు. హోలీ తర్వాత రోజు ఆలయమూర్తుల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఈరోజు నుంచి మార్చి 16వ తేదీ వరకు ఆలయ ప్రధాన అర్చకులు దీవి వెంకట జోగా చార్యులు ఆధ్వర్యంలో నిత్య పూజలు, సహస్రనామార్చనలు జరిగిన అనంతరం స్వామి వారు తిరిగి గుట్ట మీది నుంచి కోగిలవాయి గ్రామ దేవాలయంలోకి ప్రవేశిస్తారు. 17 తేదీ రోజు రాత్రి గ్రామ దేవాలయంలో స్వామివారి నాగవెల్లి కార్యక్రమం అత్యంత వైభవంగా జరుగుతుంది. దీంతో దేవదేవుని బ్రహ్మోత్సవాలు, కళ్యాణం కార్యక్రమం ముగుస్తుంది. ఎంతో వైభవంగా జరుగుతున్న ఈ జాతరను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి , ఆలయ చైర్మన్ మేకల రమాకాంత్, సర్పంచ్ చుక్క వనిత మహేందర్, ఉప సర్పంచ్ పెనుకుల ప్రశాంత్, వైస్ చైర్మన్లు పర్షబోయిన జయశంకర్, పున్నం వేణు, గౌరవ అధ్యక్షులు పెరుగు కుమారస్వామి, దాత పిన్నోజ సుబ్రహ్మణ్యా చారి , డైరెక్టర్లు పోటు సంపత్ , గడ్డం ప్రభాకర్ , పున్నం కుమారస్వామి, ఐల నాగరాజు, మోరే రాజు, దండు రాజు, ఇటుకల బాబురావు, బొచ్చు రాకేష్ , నల్ల మహేందర్ రెడ్డి, గన్ను సతీష్ , ఉప్పుల శ్రీనుతో పాటు వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినం ముందు రోజు వరకు జరిగే చంద్రగిరి శ్రీ చెన్నకేశవ స్వామి జాతరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై దేవుని కృపకు పాత్రులు కావాలని దేవస్థా నం పాలకమండలి విజ్ఞప్తి చేసింది.

## మట్టి రోడ్డే గతి...

చంద్రగిరి శ్రీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణ కోసం దేవాదాయ ధర్మాదాయ శాఖ, పర్యాటక శాఖలు కనీస వసతి సౌకర్యాలు కల్పించనప్పటికీ ప్రతి ఏటా వేలాది మంది భక్తులు ఈ గుట్ట పైకి వచ్చి శ్రీ చెన్నకేశవస్వామి వద్ద మొక్కుబడులు తీర్చుకుంటారు. పూర్వం రెడ్డి రాజుల పరిపాలన కాలంలో కొండపైకి నిర్మించిన తాత్కాలిక మెట్లే తప్ప భక్తుల సౌకర్యార్థం ఎలాంటి శాశ్వత నిర్మాణాలను ప్రభుత్వం చేపట్టలేదు. ప్రస్తుత జాతర నిర్వహణ కోసం కొండ పైకి రోడ్డు నిర్మాణ దాత పిన్నోజ సుబ్రహ్మణ్య చారి సహకారంతో జెసిబి, బుల్డోజర్ల సహాయంతో మట్టి రోడ్డును తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. నడక మార్గంలో భక్తులు కొండపైకి సులువుగా ఎక్కేందుకు రహదారిని చదును చేశారు. అదేవిధంగా మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ వరకు సీసీ రోడ్డును నిర్మించారు. ఈ క్షేత్రానికి శాశ్వతమైన మెట్ల దారి లేకపోవడంతో ప్రతి సంవత్సరం భక్తులు అవస్థలు పడుతున్నారు. చంద్రగిరి క్షేత్రంలోని గుడులు, గోపురాలు, తటాకాలను విస్తృతపరిచి సౌకర్యాలను కల్పించాల్సిన అవసరం ఉన్నది. కొండపై భాగాన శాశ్వత నిర్మాణాలతో పాటు, మెట్లు నిర్మించి, భక్తుల కోసం మౌలిక సదుపాయాలు కల్పిస్తే ఈ ఆలయం దేదీప్యమానంగా వెలుగొందుతుంది. అంతేగాక ప్రముఖ పర్యాట కేంద్రంగా కూడా ఇది బాసిల్లనున్నది.

## భక్తుల ఇలవేల్పు.. శ్రీ చెన్నకేశవ స్వామి

హనుమకొండ జిల్లా దామెర మండలం కోగిలవాయి గ్రామ పరిధి చంద్రగిరి గుట్టలలో వెలసిన శ్రీ చెన్నకేశవ స్వామిని ఈ ప్రాంత ప్రజలు తమ ఇలవేల్పుగా కొలుస్తారు. ఎత్తైన కొండల్లో వెలసిన శ్రీ స్వామి వారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చి మొక్కుబడులు తీర్చుకుంటారు. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. గుట్ట పైన భక్తులు ఒకరోజు గడిపి తీర్థ ప్రసాదాలు స్వీకరించి తిరుగు ప్రయాణం కడతారు. తమ పిల్లా పాపలు ఆరోగ్యంగా ఉండాలని , విద్యాబుద్ధులు రావాలని వేడుకోవడంతో పాటు, ఇక్కడి చాకలి బండపై నూనె పోసి ఆ నూనెను చిన్నారుల తలలపై రాసి తృప్తి పడుతుంటారు. భక్తులు చెన్నకేశవస్వామిని దర్శించుకున్న తర్వాత చెట్ల కింద మద్యం సేవించి, మధు మాంసాలు భుజించి ఇంటికి తిరుగు ముఖం పడతారు.

## రూ.5 కోట్లతో అభివృద్ధి చేయాలె!

కొండకోనల్లో వెలసిన చంద్రగిరి శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయాన్ని రూ.5 కోట్ల నిధులతో పునరుద్ధరించి భక్తులకు రవాణా సౌకర్యంతో పాటు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని సీనియర్ జర్నలిస్ట్, ప్రముఖ రచయిత గడ్డంకేశవమూర్తి కోరారు. ఈ మేరకు 2026 జనవరి 15న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఆయన వేరువేరుగా వినతి పత్రాలు సమర్పించారు. ఈ విషయమై స్పందించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి తక్షణం నిధులు విడుదల చేయాలని కోరుతూ మంత్రి సురేఖకు లేఖ రాశారు. అలాగే,జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి కొండా సురేఖ సైతం వెంటనే స్పందించి వరంగల్ దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రామల సునీతను ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆమె,ఫిబ్రవరి 19న రోడ్లు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. సురేష్ బాబుకు ఎస్టిమేషన్స్ వేసి నివేదిక అందజేయాలని కోరారు. ప్రస్తుతం ఈ 5 కోట్ల నిధులకు సంబంధించిన ప్రతిపాదన ఫైలు హనుమకొండ జిల్లా ఆర్ అండ్ బి శాఖ పరిశీలనలో ఉన్నది. తక్షణం రోడ్లు భవనాల శాఖ ఇంజనీరింగ్ అధికారులు చంద్రగిరి గుట్ట పైకి రోడ్డు, మెట్లు, విద్యుత్, వాటర్ సరఫరా, ఆలయ సమగ్ర అభివృద్ధి కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కు నివేదిక సమర్పించాలని వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి కోరారు. రూ.5 ఓట్ల నిధులు ఈ దేవాలయం అభివృద్ధి పనులకు మంజూరి ఇవ్వాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఆయన విజ్ఞప్తి చేశారు



## గజేంద్రమోక్షంగా ఖ్యాతి..

పురాణాల్లో చంద్రగిరి శ్రీ చెన్నకేశవ స్వామి పుణ్యక్షేత్రం... గజేంద్రమోక్షం జరిగిన స్థలంగా ప్రసిద్ధికి ఎక్కింది. ఈ గుట్టల్లో ఉన్న కొలనులో నీరు తాగడానికి వెళ్లిన గజేంద్రుడు ముసలి బారిన పడి విలవిలలాడుతూ శ్రీ మహావిష్ణువును వేడుకున్నాడు. వైకుంఠంలో కొలువుదీరిన శ్రీమన్నారాయణ వచ్చి శిలపై నిలిచి ముసలి బారి నుంచి గజేంద్రుడుని రక్షించాడు. అప్పుడు ఆశిల రెండుగా విడిపోయి అందులో శ్రీ చేన్న కేశవ స్వామి అవతరించాడని స్థల పురాణం చెబుతోంది. ప్రధానంగా ఈ గుట్టలపై సహజసిద్ధంగా ఏర్పడ్డ ఏడు నీటి గుండాలు ఇక్కడికి వచ్చే భక్తులకు దర్శనమిస్తాయి. దేవుడి గుండం, చాకలిగుండం, బీరెల్లి గుండం, మునిగుండం ఇందులో ముఖ్యమైనవి. ఈ గుట్టపై వెలసిన కోనేరు నందు ఎండాకాలంలో కూడా నీరు ఎండిపోకుండా ఉండడం ఇక్కడి విశిష్టత. ప్రధాన దేవాలయం సమీపంలోని కొలను మినహా మిగతా గుండాలన్నీ కాలక్రమంగా పూడ్చుకుపోయాయి.చంద్రగిరి పుష్కరేనిలో స్నానమాచరిస్తే పాపాలు పోతాయని భక్తుల విశ్వాసం. దేవాలయ మూల మండపం కాకతీయ ప్రభువులకు పూర్వం చంద్రగిరి రాజ్యాన్ని రాజధానిగా చేసుకుని పాలించిన రెడ్డి రాజులు నిర్మించినట్లు చెబుతారు. ఈ గుట్టలపై అక్కడక్కడ కట్టడాలు ఉన్నాయి. రాళ్ల మధ్యన ఉన్న చిన్న చిన్న విగ్రహాలు జాతర సమయంలో పూజలందుకుంటాయి. ఈ దేవాలయ ముఖ మండపాన్ని 170 సంవత్సరాల క్రితం మల్లారెడ్డిపల్లి గ్రామ దేశాయ్ పెసరు వెంకట్ రెడ్డి నిర్మించారు.చంద్రగిరి గుట్టల పైన రెడ్డి రాజులు నిర్మించిన కోటలు పూర్తిగా శిథిలమైపోయాయి. కేవలం ఆనవాళ్లు మాత్రమే మిగిలాయి. ఈ గుట్టల పైన చంద్రగిరి పట్టణం ఉండేదని చరిత్రకారులు చెబుతారు. నాటి రెడ్డి రాజులు నిర్మించిన గర్భగుడి,ఆంజనేయుడి ఆలయంలో జాతర సమయంలోనే పూజలు జరుగుతుంటాయి. ఇక్కడి చంద్రగిరి రాజులు శత్రువులతో తలపడి ఓడిపోయినప్పుడు రాజు కుటుంబం ప్రాణాలతో బయటపడేందుకు ఏర్పాటు చేసిన రహస్య సొరంగం కాలగర్భంలో కలిసిపోయింది. కొన్ని దశాబ్దాల క్రితం వరకు కూడా ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన వారితో పాటు విదేశీ యాత్రికులు సైతం ఈ ఆలయాన్ని సందర్శించారు.రెడ్డి రాజులు, కాకతీయ ప్రభువులు పూజించిన శ్రీ చెన్నకేశవ స్వామిని దర్శించుకోవడానికి కొండపైకి రెండు మార్గాలు ఉన్నాయి. వెంకటాపూర్, పులుకుర్తి ,సింగరాజు పల్లి గ్రామాల నుంచి, కోగిల వాయి గ్రామం నుంచి భక్తులు కాలినడకన గుట్టల పైకి వెళ్లి స్వామి వారిని దర్శించుకుంటారు. భక్తుల కోర్కెలు తీర్చే శ్రీ చెన్నకేశవ స్వామి జాతర ప్రతి ఏటా ఫాల్గుణ మాసంలో ప్రతిష్టాత్మకంగా జరుగుతుంది. జాతర ప్రారంభం రోజున శ్రీ చెన్నకేశవ స్వామి కళ్యాణం అత్యంత వైభవంగా జరుగుతుంది. పెద్ద సంఖ్యలో భక్తజన కోటి హాజరవుతుంది.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
మంగళవారం, మార్చి 10, 2026

# కేసీఆర్, కేటీఆర్‌లను కలిసిన నాగుర్ల

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్, రాష్ట్ర ఫర్టిలైజర్స్ అండ్ సీడ్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నాగుర్ల వెంకటేశ్వర్లు తన పుట్టినరోజు సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ అగ్రనేతలను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్లను వారి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా నాగుర్ల వెంకటేశ్వర్లు కేసీఆర్ పాదాభివందనం చేసి ఆశీస్సులు తీసుకున్నారు. నాగుర్ల సేవలను గుర్తించిన కేసీఆర్, కేటీఆర్‌లు ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆయన మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని, ప్రజా సేవలో ముందుండాలని మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, తక్కల్లపల్లి రవీందర్ రావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.




# ఘనంగా నాగూర్ల జన్మదిన వేడుకలు

**వరంగల్ వాయిస్, నడికూడ:** తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్, రాష్ట్ర ఫర్టిలైజర్ సీడ్ డీలర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నాగూర్ల వెంకటేశ్వర్లు జన్మదిన వేడుకలు హనుమకొండ జిల్లా నడికూడ మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా జరిగాయి. నర్సక్కపల్లి గ్రామానికి చెందిన ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని, మండల కేంద్రంలోని ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద అభిమానులు, నాయకులు భారీ ఎత్తున వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగూర్ల వెంకటేశ్వర్లు అభిమానులు ఉత్సాహంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. నాగూర్ల వెంకటేశ్వర్లు గారు నిరంతరం సామాజిక సేవలో ముందుంటారని కొనియాడారు. ముఖ్యంగా రైతుల సమస్యల పరిష్కారం కోసం ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని, భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులను అధిష్టించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో యువసేన నాయకులు లోకేటి నగేష్, రైతు నాయకులు వరికెల కిషన్ రావు, వరికోల్ ఉపసర్పంచ్ మూరాల భుజంగరావు, చౌళ్ల రామారావు, బీఆర్ఎస్ నాయకులు ఊర సతీష్ రావు, మనోహర్ రావు, రాంచందర్, దురిశెట్టి రేవంత్, కానాల మోహన్ రావు, వంకె రాజు, సురావు బాపూరావు, కుడ్ల కిషన్ రావు, దిలీప్ జి, కుసుంబ వీరన్న, మోకిడి రాజు కుమార్, సోషల్ మీడియా ప్రతినిధి నారగాని రాకేష్, కార్మిక సంఘం నాయకులు, పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.



# తక్కళ్లపాడులో పశువైద్య శిబిరం

**వరంగల్వాయిస్, దామెర :** మండల పరిధిలోని తక్కళ్లపాడు గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ దాడి వసంత రమేష్, మండల పశువైద్యాధికారి డాక్టర్ దీపిక ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ దీపిక పశుపోషకులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రభుత్వం కాలానుగుణంగా సరఫరా చేసే నివారణ టీకాలను పశువులకు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. దీనివల్ల కలిగే ప్రయోజనాలను ఆమె వివరించారు. టీకాలు వేయించడం వల్ల పశువులు వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటాయి. పశువుల్లో పునరుత్పత్తి శక్తి పెరిగి, పాల దిగుబడి గణనీయంగా పెరుగుతుంది. వ్యాధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే పాల దిగుబడి తగ్గి, రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సర్పంచ్ వసంత రమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న పశుసంవర్ధక పథకాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ దాడి రమేష్, మండల పశువైద్య విస్తరణాధికారి గంధం లక్ష్మణ్, సిబ్బంది సారంగం, శంకర్, సరిత, భరత్ పాల్గొన్నారు. అలాగే రైతులు బండారి రాజేందర్, దాడి నాగరాజు, సారా మనేష్, కేతనబోయిన చలమయ్య తదితరులు పెద్ద సంఖ్యలో తమ పశువులతో హాజరయ్యారు.



# కోటగుళ్లలో ఎస్ఐ అమూల్య ప్రత్యేక పూజలు

**వరంగల్ వాయిస్, గణపురం:** ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో టేకుమట్ల ఎస్ఐగా నియమితులైన గైకవాడ అమూల్య మంగళవారం గణపేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపురం రెండవ ఎస్ఐ గా పనిచేసిన అమూల్య మంగళవారం జరిగిన బదిలీల్లో భాగంగా టేకుమట్ల ఎస్ఐగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె గణపతి, నందీశ్వరుడు, గణపేశ్వరునికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని సాదరంగా ఆహ్వానించి శాలువాలు పూలమాలతో ఘనంగా సన్మానించి ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలను అందజేశారు.

# డ్రగ్స్ విక్రయిస్తే కఠిన చర్యలు

**వరంగల్ వాయిస్, దామెర :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా దామెర మండలంలో 'పిల్లల భద్రత – డ్రగ్స్ కు అడ్డుకట్ట' కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని కొగిల్వాయి, ఊరుగొండ, ముస్త్యాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతో పాటు దామెర డిస్నీ ల్యాండ్ హైస్కూల్‌లో విద్యార్థులకు మాదకద్రవ్యాలపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఊరుగొండ గ్రామంలో సుమారు 350 మంది విద్యార్థులు యాంటీ డ్రగ్ ప్లకార్డులు, ఫ్లెక్సీలతో ప్రధాన రహదారి నుంచి పాఠశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. "డ్రగ్స్ వద్దు – జీవితమే ముద్దు" అంటూ విద్యార్థులు చేసిన నినాదాలు గ్రామస్తులను ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో దామెర ఎస్సై కొంక అశోక్ మాట్లాడుతూ యువతకు, విద్యార్థులకు కీలక సూచనలు చేశారు. మాదకద్రవ్యాల రవాణా, నిల్వ చేసే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ఈ అవగాహన సదస్సుల్లో వరంగల్ నార్కోటిక్ పోలీస్ స్టేషన్ సబ్–ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి, మండల ఎంపీవో రంగాచారి, డిప్యూటీ తహసీల్దార్ సంపత్ రావు పాల్గొన్నారు. వీరితో పాటు ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.







# కోగిల్వాయిలో మెగా హెల్త్ క్యాంప్

**వరంగల్ వాయిస్, దామెర :** గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో దామెర మండలం కోగిల్వాయి గ్రామంలో భారీ ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఎన్ఆర్ఐవీఏ అసోసియేషన్, ఐఎంఏ వరంగల్, రెడ్ క్రాస్ హనుమకొండ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించబడుతోంది. ఈనెల 12న ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 2:00 గంటల వరకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, కోగిల్వాయి గ్రామంలో ప్రముఖ వైద్యుల సమక్షంలో వైద్య శిబిరం జరగనుంది. ఈ మెగా క్యాంప్‌లో ఐఎంఏ వరంగల్, హనుమకొండ రెడ్ క్రాస్ వైద్యులతో పాటు కిమ్స్ హస్పిటల్స్ కు చెందిన సూపర్ స్పెషాలిటీ నిపుణులు పాల్గొని రోగులకు పరీక్షలు నిర్వహించనున్నారు. ముఖ్యంగా బీపీ, షుగర్ వంటి ప్రాథమిక పరీక్షలతో పాటు వివిధ రకాల ఆరోగ్య సమస్యలకు నిపుణులైన డాక్టర్లు సలహాలు అందిస్తారు. పరీక్షల అనంతరం లబ్ధిదారులకు ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నారు. రెడ్ క్రాస్ హనుమకొండ ఛైర్మన్, ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ఈ శిబిరం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. నిపుణులైన వైద్య బృందాలు ఒకే చోట అందుబాటులో ఉండటం ప్రజలకు గొప్ప అవకాశమని, కోగిల్వాయి ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన కోరారు.



# పల్లవి మోడల్ స్కూల్ విద్యార్థినుల ప్రతిభ

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని అన్నారం పల్లవి మోడల్ స్కూల్ విద్యార్థినులు రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలో ఈనెల 7 నుంచి 9 వరకు జరిగిన 69వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్–14 సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌లో డీఎస్.సింధు, జి.నందిని వరంగల్ జిల్లా తరపున పాల్గొని సెమీఫైనల్ వరకు చేరుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను పాఠశాల ఛైర్మన్ రాచకొండ అశోక్ చారి, కరస్పాండెంట్ గంజి మహేందర్, డైరెక్టర్లు రమేష్ తదితరులు అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు.

# స్త్రీల విద్యాభివృద్ధికి కృషిచేసిన ఉద్యమకారిణి పూలే

## ☐ పాస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్త్రీల విముక్తి కోసం అహర్నిశలు శ్రమించిన నాయకి, గొప్ప రచయిత్రి.సావిత్రి బాయి పూలే అని పాస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ అన్నారు. మంగళవారం కాకతీయ విశ్వవిద్యాలయం ,దూరవిద్యా కేంద్రం ప్రాంగణంలో పూలే ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగినాయి. ఈ కార్యక్రమంలో పూలే ఆశయ సాధన సమితి (పాస్ ) రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చందా మల్లయ్య , రాష్ట్ర ఉపాధ్యక్షులు మెరుగు బాబు యాదవ్, ఆకా రాధాకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు, శ్రీరాం వీరయ్య, డాక్టర్ వంగాల సుధాకర్,జిల్లా కార్యదర్శి డాక్టర్ ఏ సంపత్ కుమార్, విజయ్, మంద శ్యాం, గైని రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
మంగళవారం, మార్చి 10, 2026



## డబ్బులు వసూలు చేస్తే ఖబర్దార్

◆ కమలాపూర్ కాంగ్రెస్ నేతలు హెచ్చరిక

**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండల కేంద్రంలోని మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు కీలక ప్రకటన చేశారు. కమలాపూర్, మర్రిపల్లిగూడెం, గూడూరు గ్రామాల్లో గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన 370 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తి చేసి, నిరుపేదలకు అందించాలని హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ బాబు కృతనిశ్చయంతో పనిచేస్తున్నారని వారు తెలిపారు. ఈ క్రమంలో కొందరు అక్రమార్కులు కాంగ్రెస్ నాయకుల పేర్లు, అధికారుల పేర్లు వాడుకుంటూ ఇళ్లు మంజూరు చేయిస్తామని పేదల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని నాయకులు పేర్కొన్నారు. ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలాంటి పైసా ఖర్చు లేకుండా, కేవలం నిజమైన అర్హులకే ఇళ్ల కేటాయింపు జరుగుతుందని స్పష్టం చేశారు. ఎవరైనా ఇళ్ల పేరుతో డబ్బులు అడిగితే వెంటనే కాంగ్రెస్ పార్టీ దృష్టికి తీసుకురావాలని లబ్ధిదారులను కోరారు. అధికారులు ఏ ఒక్క అనర్హున్ని ఎంపిక చేసినా, వారు సస్పెండ్ అయ్యే పరిస్థితి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలసాని రమేష్ గౌడ్, కమలాపూర్ ఉపసర్పంచ్ పుల్ల శ్రీనివాస్, సీనియర్ నాయకులు మౌటం కుమారస్వామి, పోడేటి భిక్షపతి, బొల్లం రాజిరెడ్డి, మాట్ల రమేష్, చెరుపల్లి రామచంద్రం పాల్గొన్నారు. అలాగే మార్కెట్ డైరెక్టర్లు సముద్రాల కృష్ణ, జనగాని శివకృష్ణ, ఉరుసు తిరుపతి, ఆకినపల్లి బిక్షపతి, వార్డు మెంబర్ జన్ను భిక్షపతి, ఆడెపు శ్రీకాంత్, మాట్ల కళ్యాణ్ పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

□ మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు




**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల 'ప్రజాపాలన' కార్యక్రమంలో భాగంగా, టీజీ నాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య ఆదేశాల మేరకు మంగళవారం ఆత్మకూరు మండల కేంద్రంలో డ్రగ్స్ నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువతను పెడదారి పట్టిస్తున్న మాదక ద్రవ్యాల పట్ల అప్రమత్తం చేయడమే లక్ష్యంగా ఈ సదస్సు సాగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి విద్యార్థులకు, యువతకు క్షుణ్ణంగా వివరించారు. డ్రగ్స్ వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు ఉజ్వలమైన భవిష్యత్తు చిన్నాభిన్నమవుతుందని హెచ్చరించారు. డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్, నార్కోటిక్ డ్రగ్స్ ఎస్ఐ మొగలి, ఫారెస్ట్ అధికారి లక్ష్మణాచారి, సిఐ సంతోష్, ఎక్సైజ్ శాఖ అధికారులు, ఎంపీవో,పోలీస్ సిబ్బంది, ఆత్మకూరు సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి రాజు, వార్డు సభ్యుడు సందీప్, సుమారు 100 మంది విద్యార్థులు, 20 మంది యువకులు పాల్గొన్న ఈ కార్యక్రమం అత్యంత విజయవంతంగా ముగిసింది.

## మైనారిటీ బాలికల గురుకులంలో వైద్య పరీక్షలు



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మంగళవారం దేవగిరి పట్టణంలోని మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో భారీ వైద్య శిబిరం నిర్వహించారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్ బీఎస్కే) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో విద్యార్థినులకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు విద్యార్థులను పరీక్షించి, సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కంటి చూపు సమస్యలు, రక్తహీనత వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి తగిన సలహాలు, మందులు అందజేశారు. విద్యార్థి దశలోనే ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండటం వల్ల మెరుగైన ఫలితాలు సాధించవచ్చని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత, ఆర్ బీఎస్కే మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ శ్రీలత నేతృత్వంలోడాక్టర్ అరవింద, డాక్టర్ మనోహర్, డాక్టర్ పవన్, డాక్టర్ వినోద్, డాక్టర్ జాన్సన్, డాక్టర్ సునీత, డాక్టర్ ప్రవీణ్ రెడ్డి, డాక్టర్ సుజిత్,ఆప్తాల్మిక్ ఆఫీసర్ తిరుపతి, పాఠశాల హెల్త్ సూపర్వైజర్ దీపిక, ఫార్మసీ ఆఫీసర్ మాధురి, ఏఎన్ఎం సుభాషిని, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## పశువుల ఆరోగ్యం.. రైతులకు ఆర్థిక బలం

□ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్, గణపురం :** పశువుల ఆరోగ్యం రైతుల ఆర్థికాభివృద్ధికి ఎంతో కీలకమని, పశుసంపద బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంటుందని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం గణపురం మండలంలోని బుద్ధారం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'గాలికుంటు వ్యాధి నివారణ టీకా' కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా పశువులకు టీకాలు వేయించి కార్యక్రమాన్ని వేగవంతం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ గాలికుంటు వంటి ప్రమాదకర వ్యాధులు సోకకముందే ముందస్తుగా టీకాలు వేయించడం వల్ల పశువుల ప్రాణాలను కాపాడుకోవచ్చని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పశుసంపదను రక్షించేందుకు అనేక చర్యలు చేపడుతోందని, వీటిని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశువులు ఆరోగ్యంగా ఉంటేనే పాల దిగుబడి పెరుగుతుందని, తద్వారా రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ విడిదినేని శ్రీలత అశోక్, ఉపసర్పంచ్ మారబోయిన ఐలయ్యతో పాటు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. పశుసంవర్ధక శాఖ అధికారులు, ఎమ్మార్వో, ఎంపీడీఓ, ఇతర ప్రజాప్రతినిధులు, బుద్ధారం గ్రామస్థులు, పశుపోషకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.




## విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ప్రభుత్వ ఉన్నత పాఠశాల హనుమకొండలో క్రీడా దినోత్సవం, అంతర్జాతీయ మహిళా దినోత్సవం, పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాలు పాఠశాల ఆవరణలో ఎంతో ఉత్సాహభరితంగా సాగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, జీటీఏ జనరల్ సెక్రటరీ, కాకతీయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ఆచార్యులు హాజరయ్యారు. ప్రత్యేక అతిథులుగా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ విజయ్ కుమార్ మాజి, ఇస్లామియా కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ వరంగల్ ప్రిన్సిపాల్ డా. లేతాకుల వెంకట్రాం రెడ్డి, అలాగే గంప అశోక్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు రాబోయే బోర్డు పరీక్షలకు ఉపయోగపడే విధంగా ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నులను అందజేశారు. క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు వివిధ క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుర్ర రమేష్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించారు. కార్యక్రమం విజయవంతం కావడంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది అందరి సహకారం ప్రశంసనీయం అని నిర్వాహకులు తెలిపారు. చివరగా పదవ తరగతి విద్యార్థులు తమ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాల ప్రతిష్టను మరింత పెంచాలని అందరూ ఆకాంక్షించారు.



## ఆర్డీఎఫ్ లో 10వ తరగతి హాల్ టికెట్ల పంపిణీ

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని ఆర్‌డీఎఫ్ కల్లెడ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదపూజ చేసి ఆశీర్వాదాలు తీసుకుని వారి చేతుల మీదుగా హాల్ టికెట్లు స్వీకరించారు. ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## సీఎం, ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి నిధుల కేటాయించిన సీఎం నిధులు తేవడం లో కృషి చేసిన పశ్చిమ ఎమ్మెల్యే నాయిని, ఎంపీ కావ్యలకు కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా కో ఆర్డినేటర్ కల్లూరి పవన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో లో జరుగని అండర్ డ్రైనేజీ నిర్మాణం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో ఇచ్చిన మాట ను నిలబెట్టుకుంది. యూజీడీ నిర్మాణం వలన వరంగల్ నగరం అభివృద్ధి చెందుతుంది. 5257.20 కోట్లు నిధులు తేవడంలో కృషి చేసిన ఎమ్మెల్యే నాయిని ఎంపీ కావ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

## వ్యభిచార కేంద్రంపై పోలీసుల దాడి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని సర్క్యూట్ హౌస్ రోడ్డులో గల ఓ అద్దె ఇంట్లో సాగుతున్న వ్యభిచార కేంద్రంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. పేదరికాన్ని ఆసరాగా చేసుకుని ఇద్దరు బాధితులతో వ్యభిచారం నిర్వహిస్తున్న వేలేరు మండలం సదాశపల్లికి చెందిన తిమ్మపురం లలితను, విటులు పున్నం రాజు, సయ్యం అరుణ్ కుమార్ ను పోలీసులు పట్టుకున్నారు. ఏసీపీ మధుసూదన్ పర్యవేక్షణలో ఇన్స్పెక్టర్ పవన్ కుమార్, ఎస్ఐ ఉప్పలయ్య బృందం ఈ దాడిని చేపట్టింది. నిందితుల నుంచి 14,100 రూపాయల నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు, 14 కాండోమ్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. విముక్తి కలిగించిన బాధితులతో పాటు నిందితులను తదుపరి చర్యల నిమిత్తం స్థానిక పోలీసులకు అప్పగించినట్లు అధికారులు వెల్లడించారు.

# హసన్ పర్తికి 'నీటి' కష్టాలు

**□ ఖాళీ బిందెలతో మహిళల రాస్తారోకో**



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** వేసవి కాలం ఆరంభంలోనే హసన్ పర్తి ప్రజలకు చుక్కలు కనిపిస్తున్నాయి. మంచినీటి సమస్య తీవ్రరూపం దాల్చడంతో విసిగిపోయిన స్థానిక మహిళలు మంగళవారం ఉదయం ఖాళీ బిందెలతో హనుమకొండ-కరీంనగర్ జాతీయ రహదారిపై బైఠాయించారు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయి భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వారానికి ఒకసారి మాత్రమే నల్లా నీళ్లు వదులుతుంటే తమ అవసరాలు ఎలా తీరుతాయని మహిళలు అధికారులను నిలదీశారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. "మార్చి నెలలోనే పరిస్థితి ఇలా ఉంటే, ఎండలు ముదిరితే మా గతేంటి?" అని ఆందోళన వ్యక్తం చేశారు. రాస్తారోకో సమాచారం అందుకున్న హసన్ పర్తి ఎస్సై దేవేందర్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. మహిళలతో మాట్లాడి సమస్య తీవ్రతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేందర్‌తో ఫోన్‌లో మాట్లాడి, తక్షణమే నీటి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. శాశ్వత పరిష్కారం లభించే వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని సూచించారు. ఎస్సై హామీతో మహిళలు తమ ఆందోళనను విరమించారు.పోలీసుల చొరవతో తక్షణ ఉపశమనం కోసం అధికారులు ట్యాంకర్ ద్వారా నీటిని పంపిణీ చేశారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి హసన్ పర్తిలో నీటి ఎద్దడి తలెత్తకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఇంటర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

**□ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ దివాకర్ టీఎస్**

**వరంగల్ వాయిస్, ములుగు :** ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. మంగళవారం వెంకటాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం జరుగుతున్న పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. మాల్ ప్రాక్టీస్ కి ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జవాబు పత్రాల రవాణాకు పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్షలు పూర్తయ్యేంతవరకు విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు



# కేజీబీవీ, సమగ్ర శిక్షణ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**□ టీఎస్ యూటీఎఫ్ డిమాండ్**




**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్, సమగ్ర శిక్షా అభియాన్ లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని టీఎస్ యుటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు దూపటి కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన మూడు దశల పోరాటంలో భాగంగా, మంగళవారం హసన్ పర్తి కేజీబీవీ పాఠశాల,మండల విద్యా వనరుల కేంద్రం (MRC) వద్ద భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన కోర్కెలపై ప్రభుత్వాన్ని నిలదీశారు.ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కన్వీనర్ జి.భాస్కరరావు, మండల అధ్యక్షులు రమాదేవి, ప్రధాన కార్యదర్శి టి.నరేష్, మండల కార్యదర్శి కే.వెంకట రమణారెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు కేజీబీవీ ప్రత్యేక అధికారిణి స్వప్న, ఉపాధ్యాయులు, ఎంఆర్సీ సిబ్బంది, సమగ్ర శిక్ష ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

# ఇందిరమ్మ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**

**వరంగల్ వాయిస్, ములుగు :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను అందిస్తుందని మొదటి విడతలో మంజూరైన లబ్ధిదారులు తమ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరిత గతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 99 రోజులు నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్. వెంకటాపూర్ మండల కేంద్రంలో, నల్లగుంట, ఎల్లారెడ్డి పల్లె గ్రామాలలోని నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను, గ్రామాల్లో జరుగుతున్న పరిశుభ్రత కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెంకటాపూర్, నల్ల గుంట, ఎల్లారెడ్డి పల్లె, గ్రామాల్లో మొత్తం ఎన్ని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని , వాటిలో ఎన్ని ఇండ్లు నిర్మాణాలు పూర్తి అయ్యాయని, మిగిలినవి ఏ.ఏ దశలో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్ ను లబ్ధిదారులకు తక్కువ ధరకు ఇప్పించి ఇండ్ల నిర్మాణపు పనులు త్వరగా పూర్తయ్యేలా కృషి చేయాలన్నారు. ఇప్పటి వరకు నిర్మాణం అయినంత వరకు లబ్ధిదారుల అకౌంట్ లలో డబ్బులు జమ అవుతున్నాయా అని ఆరా తీశారు. ఏ కారణాల చేత ఇండ్ల నిర్మాణాలు పెండింగ్ లో ఉన్నాయనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ దశలో మిగిలి ఉన్న నిర్మాణ పనులను కూడా పూర్తి చేస్తే చివరి బిల్లు కూడా వస్తుందని త్వరగా పూర్తి చేసుకొని ఉగాది పండుగ వరకు గృహ ప్రవేశాలు చేపట్టాలన్నారు. మంజూరు చేసిన ఇళ్లను లబ్ధిదారులు ఏప్రిల్ నెలలో పనులు ప్రారంభించక పోతే రద్దు చేసే అవకాశం ఉంటుందన్నారు. పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజలు కూడా ఈ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని స్వచ్ఛమైన పరిసరాల నిర్మాణానికి సహకరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ సూర్యనారాయణ, వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ మామిడి శెట్టి సుగుణ, రామప్ప ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మెన్ మిల్కురి ఐలయ్య, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్ పాఠశాలలో ప్రవేశాల దరఖాస్తులకు ఆహ్వానం



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి:** హనుమకొండ జిల్లాలోని స్పోర్ట్స్ పాఠశాలలో నాలుగవ తరగతి ప్రవేశాల కోసం ఆసక్తి గల విద్యార్థుల తల్లిదండ్రులు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని హసన్‌పర్తి మండల విద్యాశాఖ అధికారి ఏ.శ్రీనివాస్ తెలిపారు. ఫిబ్రవరి 26 నుంచి మార్చి 12 వరకు ఆన్ లైన్ లో దరఖాస్తులు స్వీకరించబడతాయని, ఆసక్తి గల అభ్యర్థులు https://tgss.telangana.gov.in అనే లింక్‌ను ఓపెన్ చేసి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ ప్రవేశాలకు 01-09-2017 నుంచి 31-08-2018 మధ్య జన్మించిన విద్యార్థులు మాత్రమే అర్హులు. ఈ తేదీలకు ముందు లేదా తరువాత జన్మించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అనర్హులవుతారు.దరఖాస్తు చేసిన విద్యార్థులకు మార్చి 13 నుంచి 17 వరకు మండల స్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహించబడతాయి. అనంతరం మార్చి 28 నుంచి ఏప్రిల్ 1 వరకు జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహించి స్పోర్ట్స్ పాఠశాలలో ప్రవేశాలు కల్పిస్తారు. క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థులను గుర్తించి, సంబంధిత ఉపాధ్యాయులు మరియు ప్రధానోపాధ్యాయులు వారి తల్లిదండ్రులకు తగిన సూచనలు చేసి ఆన్ లైన్ దరఖాస్తులు చేయించేందుకు సహకరించాలని మండల విద్యాశాఖ అధికారి ఏ.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.



# పల్లె ప్రకృతి వనాలను వాడుకలోకి తీసుకురావాలి

**వరంగల్ వాయిస్, దామెర:** గ్రామాల్లో ఉన్న పల్లె ప్రకృతి వనాలను వాడుకలోకి తీసుకురావాలని దమ్మన్నపేట గ్రామ సర్పంచ్ నవీన్ సూచిం చారు. 99రోజుల ప్రత్యేక కార్యాచరణ, ప్రణాళికలో భాగంగా ప్రకృతి వనాన్ని సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి కవిత, రంజిత్ రెడ్డి, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# రోళ్లకల్, నారాయణపురంలో వాటర్ ప్లాంట్లు

**□ ఐదు రూపాయలకే స్వచ్ఛమైన నీరు**



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని రోళ్లకల్, నారాయణపురం గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చాయి. గ్రామాల్లో మంచినీటి కొరత లేకుండా చూసేందుకు హైదరాబాద్‌కు చెందిన 'హైజాల్'స్వచ్ఛంద సంస్థ సహకారంతో రెండు గ్రామాల్లో నూతన వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. స్థానిక ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు స్పందించిన హైజాల్ సంస్థ, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ప్లాంట్లను నెలకొల్పింది. దీని ద్వారా గ్రామస్తులకు కనీస ధరకు స్వచ్ఛమైన తాగునీటిని అందించనున్నారు. ప్రతి కుటుంబానికి కేవలం 5 రూపాయలకే ఒక క్యాన్ సురక్షిత జలాన్ని అందించేలా ఏర్పాట్లు చేశారు ఈ సందర్భంగా రోళ్లకల్, నారాయణపురం సర్పంచులు మాట్లాడుతూ.. తమ గ్రామాలపై ప్రత్యేక అభిమానంతో సహకరించిన హైజాల్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ వాటర్ ప్లాంట్ల ఏర్పాటుతో గ్రామాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# విద్యార్థులు మంచి మార్కులు సాధించాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్
- సమయాన్ని వృథా చేయకుండా చదవాలి
- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన మంత్రి



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదివి ఉన్నత ఫలితాలు సాధించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక కేజీబీవీ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాల సందర్శనలో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను మంత్రి స్వయంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కింద కూర్చుని మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం రుచిగా ఉందా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షల దృష్ట్యా ఈ చివరి రోజులు చాలా కీలకమని, క్రమశిక్షణతో చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

అనంతరం గట్ల నర్సింగాపూర్ రైతు వేదికలో 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణపై వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు.

సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించి, గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రభుత్వ సిబ్బంది పాల్గొన్నారు.



## రేణుక ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే నాయిని

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 48, 49 డివిజన్‌ల పరిధిలో నిర్వహిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మ బోనాల సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక నాయకులు, భక్తులతో కలిసి ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కోసం సీడీఎఫ్ నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రకటించారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గౌడ సంఘ కులస్తులు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ని ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



## విద్యతోనే మహిళా సాధికారత సాధ్యం

**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్ :** మహిళా అభ్యున్నతికి విద్యే మూలస్తంభమని, సావిత్రిబాయి పూలే ఆశయాలను కొనసాగించినప్పుడే నిజమైన మహిళా సాధికారత సిద్ధిస్తుందని కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి (వీసీ) ఆచార్య ప్రతాప్ రెడ్డి అన్నారు. మంగళవారం కేయూ బీసీ సెల్ సంచాలకులు డాక్టర్ బి.సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతి' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దూర విద్య ప్రాంగణంలోని సావిత్రిబాయి–జ్యోతిరావు పులే దంపతుల విగ్రహాలకు వీసీ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గౌరవ అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం మాట్లాడుతూ.. ఎన్నో సామాజిక వివక్షలను, అవమానాలను ఎదుర్కొని స్త్రీ విద్య కోసం పోరాడిన మహనీయురాలు సావిత్రిబాయి అని అన్నారు. కేయూ పాలక మండలి సభ్యులు ఆచార్య బి.సురేష్ లాల్, డాక్టర్ బి.రమ, డాక్టర్ ఎన్.సుదర్శన్‌లతో పాటు పలువురు విభాగాధిపతులు, బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

## కేయూలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'

**ల్యాబ్‌ల నిర్వహణ, క్లీన్ అండ్ గ్రీన్‌పై ప్రత్యేక దృష్టి**



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న 10 రోజుల 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం కాకతీయ విశ్వవిద్యాలయంలో ఉత్సాహంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా మంగళవారం వర్సిటీలోని వివిధ విభాగాల్లో అవగాహన, పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు. విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల, ఇంగ్లీష్ విభాగంతో పాటు ఇతర విభాగాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు. 'క్లీన్ అండ్ గ్రీన్' కార్యక్రమంలో భాగంగా విభాగాధిపతుల పర్యవేక్షణలో ప్రాంగణాలను పరిశుభ్రం చేశారు. కంప్యూటర్ ల్యాబ్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలను పరిశీలించి వాటి పనితీరును సమీక్షించారు. భవిష్యత్తులో సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహణ స్థితిగతులను తనిఖీ చేశారు. ముఖ్యంగా సీఎస్ డీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సీఎస్ఈ అండ్ ఐటీ ల్యాబ్‌లలో ప్రత్యేక శుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులు సమూహాలుగా విడిపోయి ల్యాబ్ పరిసరాలను అత్యంత శుభ్రంగా మార్చారు. విద్యార్థులు చూపిన చొరవను కళాశాల అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించింది. ఈ కార్యక్రమం ద్వారా విశ్వవిద్యాలయంలో ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడిందని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

## జనాభా గణన–2027కు సర్వం సిద్ధం

- అధికారులకు మూడు రోజుల శిక్షణ ప్రారంభం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దేశవ్యాప్తంగా నిర్వహించనున్న 16వ జనాభా గణన (సెన్సస్–2027)ను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో పాటు వరంగల్ మహానగర పాలక సంస్థ అధికారులకు ఉద్దేశించిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మంగళవారం ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరుగుతున్న మొట్టమొదటి జనాభా గణన ఇదే కావడం విశేషం. ఈసారి ప్రక్రియలో కొన్ని కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. దేశంలోనే తొలిసారిగా మొబైల్ యాప్‌లు, వెబ్ పోర్టల్‌ల ద్వారా డిజిటల్ పద్ధతిలో గణన నిర్వహిస్తారు. ప్రజలు తమ వివరాలను తామే స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు వీలుగా గణన ప్రారంభానికి 15 రోజుల ముందే ప్రత్యేక పోర్టల్ అందుబాటులోకి రానుంది. జనాభా గణనను రెండు ప్రధాన దశల్లో పూర్తి చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. మే 11, 2026 నుంచి జూన్ 9, 2026 వరకు గృహాల గణన జరుగుతుంది. ఇందులో ఇంటి వసతులు, సౌకర్యాలకు సంబంధించిన 33 ప్రశ్నల ద్వారా వివరాలు సేకరిస్తారు. ఫిబ్రవరి 2027లో అసలు జనాభా గణన జరుగుతుంది. మార్చి 1, 2027ను ప్రామాణిక తేదీగా పరిగణిస్తారు. జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి బి.సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు ఈ గణాంకాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన జనాభా గణన విభాగం సంయుక్త సంచాలకులు డి.సుబ్బరాజు, గణాంక అధికారి ఎస్.సతీష్ నేతృత్వంలో అధికారులకు బ్లాకుల విభజన, సమాచార సేకరణపై పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), డీఆర్వో, డీఎఫ్ఓ, ఆర్డీఓలు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, గ్రేటర్ వరంగల్ అధికారులు పాల్గొన్నారు.

## వరంగల్ ప్రజల 35 ఏళ్ల కల సాకారం

- నాయినిని సన్మానించిన బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ ప్రజల దశాబ్దాల చిరకాల వాంఛ అయిన 'అండర్ గ్రౌండ్ డ్రైనేజ్' ప్రాజెక్టును సాకారం చేసే దిశగా అడుగులు వేస్తున్న వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్‌రెడ్డిని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ నగరం అభివృద్ధిలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తనదైన ప్రత్యేక విజన్‌తో పనిచేస్తున్నారని కొనియాడారు. ప్రధానంగా 35 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సమస్యను పరిష్కరించడంలో ఆయన పోషించిన పాత్ర ఎంతో కీలకమైనదని పేర్కొన్నారు. ఈ భారీ ప్రాజెక్టుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బొద్దిరెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com